భమిడిపాటి వెంకటరమణ

కళ్యాణ శోభ

ఉదయం తొమ్మిదిగంటల వేళ. ఆఫీసుకి పోవలసిన భర్తకు, బడికి పోవలసిన పిల్లలకు భోజనం సిద్ధం చేస్తున్నది శారద. గుమ్మంలో రిక్షా ఆగింది. నరసింహమూ భార్యా దిగారు.

'మీరెప్పుడు వచ్చారు? కూర్చోండి!' అంటూ పలకరించాడు సత్యన్నారాయణ.

'కూర్చోడానికి వ్యవధి లేదు వెంటనే వెళ్ళాలి' అన్నాడు నరసింహం.

'ఏమిటి సంగతి?' అని వాళ్ళవైపు ఆశ్చర్యంగా చూశాడు సత్యన్నారాయణ.

నరసింహం భార్య కట్టుకొన్న పట్టు చీర, పట్టురవిక, ముఖంనిండా పౌడరు, సెంటు వాసనలు, చేతిలో సిల్కురుమాలు, అందులో వెండి కుంకుమ భరిణ చూడగానే అందుకుంది శారద. 'పెళ్ళివారిలాగ వున్నారండీ!' అని.

'ఎవరికి పెళ్ళి?' అని అడిగాడు సత్యన్నారాయణ.

'మా చిన్న చెల్లెలు సరస్వతికి.'

'ఎప్పుడు? ఎక్కడ? ఆ సంగతి ఇంకా చెప్పవేమి?'

'ఇక్కడే ఇప్పుడే. ఆ సంగతి చెప్పడానికే ఇప్పుడు వస్తి. ఇవాళ 10–30 గంటలకి ముహూర్తం. నువ్వూ వదినా పిల్లలూ తప్పక రావాలని అని అన్నయ్య చెప్పమన్నాడు. వెంటనే బయలుదేరాలి మరి.' అన్నాడు నరసింహం.

'ఇదేమిటి విచిత్రంగా వుందే. ఇక్కడ వుండిన నాకు కూడా ఈ సంగతి ఇంతవరకు తెలవకపోవడానికి కారణం ఏమిటి, మీ అన్నయ్య?'

'అన్నయ్యకి మాత్రం తెల్సా ఏమిటి? సంబంధ నిశ్చయించింది నేను. వారం రోజులయింది. పెళ్ళికొడుకు మా ఆఫీసులోనే అకౌంటెంటు. వాళ్ళు అడిగినదానికి.. ఇష్టపడి కొంత అడ్వాన్సు కూడా ఇచ్చేసి వచ్చేశాను. వాళ్ళు తొందరలో ముహూర్తం పెట్టుకున్నారు. చూడబోతే వారం తిరగకుండావే ముహూర్తం కుదిరింది. మొన్నసాయంత్రమే వచ్చి అన్నయ్యకే సంగతి చెప్పాను.

మిగతా ఏర్పాట్లు అన్ని చెయ్యమని, పెళ్ళివారు వచ్చి గుమ్మంలో కాలుపెట్టే వరకూ ఎలాంటి ఏర్పాట్లు చెయ్యవన్నాడు. వాళ్ళు నిన్న సాయంత్రం రైలు దిగారు. రాత్రికి రాత్రి ఏర్పాట్లు అన్నీ జరిగాయి.

అప్పటికి మిమ్మల్ని పిలవడానికి వదినా మా ఆవిడా కూడ వచ్చారు. కానీ మీ ఇల్లు కనుక్కోలేక పోయారు.'

'అవునండీ ..ఆ రిక్షావాడు ఒక చోటు కని చెబితే మరొకచోటుకి తీసుకొని పోయాడు అర్థరాత్రివరకు వెతికి ఇల్లు తెలుసుకోలేక తిరిగి వెళ్లిపోయాం' అన్నది నరసింహం భార్య

'ఇప్పుడయినా అడుగడుగునా అడుగుతూ వస్తూనే ఇక్కడికి చేరగలిగాను.' అని ముగించాడు నరసింహం.

'ఈ మహాపట్నంలో వుండే చిక్కే అది. ఒకసారి చూసిన ఇల్లయినా మళ్లీ తెలుసుకోవడం అంటే అసాధ్యమే' అన్నాడు సత్యన్నారాయణ.

'ఇంక ఏమాత్రం ఆలశ్యం చెయ్యవద్దు బయల్దేరండి' అన్నాడు నరసింహం.

'మేమూ మీ వెంట వెంట వస్తున్నాం' అన్నాడు సత్యన్నారాయణ

శారద ముఖాన్ని బొట్టుపెట్టి వెళ్లిపోయారు వాళ్లు

సత్యన్నారాయణ, పిల్లలూ పెళ్లివారింటికి చేరుకునేసరికి పదిగంటలయింది పెళ్లిపందిరి భజంత్రీలతో మారుమ్రోగుతూంది అప్పుడే వధూవరులు మంగళస్నానాలుచేసి పీటలమీద కూర్చొన్నారు శుభముహూర్తం సమీపిస్తున్నది రామ్మూర్తి, భార్యా కంకణాలు కట్టుకొని కూర్చున్నారు నరసింహం వచ్చిన వాళ్లందరినీ ఆదరించి కూచోబెడుతున్నాడు రామ్మూర్తి సత్యన్నారాయణను ఒకమారు పలకరించాడు ముందు ఫలహారాలు చేసి మరీ కూర్చోమన్నాడు

ఫలహారాల గదిలో కనిపించింది పార్వతి పార్వతి రామ్మూర్తి పెద్ద చెల్లెలు ఏడో ఏటనే దానికి పెళ్లికావడం, ఏడాది తిరగకుండానే ఆ మొగుడు కాస్తా చనిపోవడం జరిగింది పాతికేళ్ళకిందటిమాట ఆ తరువాత రాఘవయ్యగారి కుటుంబం చితికిపోవడం, ఆ తరువాత ఆయన పోవడం జరిగాయి అప్పట్లో దానికి మళ్లీ పెళ్లిచెయ్యలేకపోయారు ఆతరవాత రామ్మూర్తి ఉద్యోగం చేస్తూ నాలుగు రాళ్లు సంపాదిస్తూ, తమ్ముళ్ళకి, చెల్లెళ్లకీ చదువులు చెప్పించి ప్రయోజకుల్ని చేశాడు కాని పార్వతికి మాత్రం మళ్లీ పెళ్లి చెయ్యలేదు సీతారామమ్మ చాదస్తం రామ్మూర్తికి కూడ పట్టుకుంది కాబోలు! అప్పుడే ముప్పయి ఏడు ఏళ్లు నెత్తిని పడ్డాయి పార్వతికి తలలో నెరిసిన జుత్తు మెరుస్తూంది ముఖాన్ని బొట్టులేకుండ శరీరం మీద ఇంకే ఆభరణమూ లేకుండా సాదా చీరతో కన్పించిన పార్వతిని చూడగానే 'అన్యాయం జరిగింది' అనిపించింది సత్యన్నారాయణకు.

'ఏమే పార్వతీ ఏం చేస్తున్నావు ?' అని అడిగాడు

'ఏముందీ, ఏదో మానవ సేవ సర్వోదయ సంఘంలో చేరాను. చెడ్డదాన్ని అనిపించుకోకుండా ఇలా బ్రతుక్కొస్తున్నాను.'

'ఎక్కడ పని ?'

'మారు మూల గ్రామాల్లో.'

'అయితే ఇక్కడికి యెలా రాగలిగావు ఈ వేళకి సరిగ్గా ? ఊళ్లో వున్న నాకే తెలేదే యింతవరకూ ?!'

'నాకు మాత్రం తెల్సా ఏమిటి ? రెండు రోజుల క్రితం, యేదో పని మీద ఇక్కడికి వస్తే వీళ్ళు ఉండి పొమ్మన్నారు ఈ ఏర్పాటు వుందని'

'అమ్మా, సరోజ, శివుడూ కనిపించరేం, వాళ్లకీకబురు అందలేదా ?'

'వాళ్లకీ నిన్ననే టెలిగ్రాము వెళ్లింది అందిన వెంటనే రాత్రిబండికి బయలుదేరితే ఈపాటికి రావలసినవాళ్లే తప్పితే రాత్రికి వస్తారు'

'సరోజ ఏం చేస్తూంది ? దానికి పెళ్లి అయిందా ?'

'లేదు అది ఉద్యోగం చేస్తూందిట పెళ్లి అక్కర్లేదు అన్నదట అందుకే చిన్నదానికి సరస్వతికి పెళ్లి యేర్పాటు చేశారు'

కుశల ప్రశ్నలతో ఫలహారాలు పూర్తి చేసుకొని బయటకొచ్చాడు సత్యన్నారాయణ శారద అప్పుడే పెళ్లివారితో కలిసిపోయింది. పక్కలు పట్టుకుందికి సహాయపడుతూంది పిల్లలు భజంత్రీల వాళ్లదగ్గరకు వెళ్లి కూర్చున్నారు మగ పెళ్లివారి తరపున పెళ్లికొడుకు తండ్రి, మేనమామ తప్పిస్తే తక్కిన అందరూ క్రొత్తవారు. పెళ్లికొడుకు స్నేహితులు. పెద్దాయనతోనే బంధుత్వం తెలుపుకున్నాడు సత్యన్నారాయణ. రామ్మూర్తీ తనూ పెత్తండ్రి పినతండ్రి కొడుకులు. ఇరవై యేళ్లు వచ్చేవరకు ఒక చోటనే వుండేవారు, ఆ తరువాత ఉద్యోగరీత్యా విడిపోయారు. మళ్లీ ఈనాటికి యిక్కడ కలుసుకోవడం సంభవించింది— ఇలా నడుస్తూంది సంభాషణ. ఇంతలో 'మరదిగార్ని ఇలా ఒక్కసారి రమ్మనండి' .అని కబురు వస్తే వెళ్లాడు సత్యన్నారాయణ

'మీరు యిప్పుడే రైలు దిగి వచ్చారని పెళ్లివారితో చెప్పాం ఆ మూడు ముళ్లూ పడేవరకూ ఏ మాటా అనకుండా వుండడం ఎందుకేనా మంచిది' అని వదినగారి శాసనం.

'అబద్ధం యెందుకు ఆడాలి? తను ఆడిన మాటల్లో తప్పేముంది ?' తెలిసింది కాదు సత్యన్నారాయణకు.

మంగళసూత్రధారణం అయిపోయింది తరువాత కార్యక్రమం వెంటనే ఆరంభించాడు పురోహిత్యుడు

కట్నం ఐదువేలు పైచిలుకే అని తెలుసుకున్నాడు సత్యన్నారాయణ

ఇంతకట్నం ఎందుకు ఇస్తున్నాడో రామ్మూర్తి ? తనదగ్గర వుంటేమాత్రం ? తనకు మాత్రం పెళ్లికి కూతుళ్లు లేరా ?

రాత్రికి శోభనానికి ఏర్పాట్లు జరగాలి. [illegible], గ్యాసులైట్లు, పువ్వులూ, సెంట్లూ [illegible] అలంకారాలు సత్యన్నారాయణమీద పెట్టారు భోజనం చేసిన వెంటనే బయలుదేరాడు సత్యన్నారాయణ

రాత్రి పదిగంటలకల్లా నూత్నదంపతుల్ని పడకగదిలోకి పంపించేసి ఎవరు దారిని వారు పోయారు సీతారామమ్మ ఇంకా రాలేదు కారణం ఏమయి వుంటుందా? అనుకున్నాడు సత్యన్నారాయణ రామ్మూర్తీ, నరసింహం స్టేషనుకు వెళ్లారు, ముసలి దానికి ఇంటికి దారి తెలుస్తుందో తెలియదో అని ఎదురుగా ఉండడం చాత కుర్చీలో వాలబడగానే కునుకు పట్టేసింది సత్యన్నారాయణకు ఎంతసేపు అలా నిద్రపోయాడో తెలియదుగాని ఓ రాత్రప్పుడు కేకలు, అరుపులు, సాధింపులు, చికాకులు, గడిబిడితో మెలకువ వచ్చేసింది సీతారామమ్మ వచ్చింది రావడంలోనే ఆరంభమయింది గొడవ. అక్కడ ఇక ఒక్కక్షణం

కూడా వుండనని, తిరుగు బండికే వెళ్ళి పోతానని అంటూంది ఆవిడ. రామ్మూర్తి పెద్దగా కేకలు వేస్తున్నాడు. 'ఆ నోరు మూసుకొని పడివుండమను' అని సీతారామమ్మ స్టేషనుదగ్గర్నుంచే గోల ఆరంభించింది ఆవిణ్ణి ఇంటికి తీసుకొని రావడమే కష్టమయింది. వచ్చినదగ్గర్నుంచి ఆవిడ ఒకటే రాగాలు తన కూతురు పెళ్ళి తనకు కళ్ళారా చూసుకువేందికి లేకుండా చేసారని కళ్ళారా ఒక్కకూతురు కళ్యాణశోభ చూడలేకపోయిందని ఆవిడ ఏడ్పు పార్వతి బ్రతుకు అలా బ్రద్దలయింది, సరోజమాట దేవుడెరుగును. సరస్వతినయినా పచ్చగా పెళ్ళికూతురు వేషంలో చూడలేకపోయింది

'శుభమస్తు' అని పెళ్ళి చేస్తూవుంటే ఈ ఏడ్పులేమిటి? ఇంతవరకు ఎలాగూ రానే వచ్చింది ఇప్పుడిక గోలపెట్టి ప్రయోజనం ఏమిటి? మరింత రభసగాని?' అని ఎంత సముదాయించినా ప్రయోజనం లేకపోయింది.

ఉదయం పెళ్ళివారితో చెప్పినప్పుడు; 'అమ్మకి ఆరోగ్యం సరిగ్గా వుండడం లేదు మతికూడ చెడినట్టుంది. ఎవ్వరూ మాట్లాడించకండి' అని అన్నాడు రామ్మూర్తి

'నాకేమీ మతిపోలేదు. బాగానే వున్నాను. వీళ్ళందరూ కలిసి నన్ను పిచ్చిదాన్ని చేసారు. నిజంగా మతిపోయింది నాకు కాదు వీళ్ళకి. లేకుంటే కన్నతల్లిని తన కూతురు పెళ్ళి చూడనివ్వకుండా చేస్తారా? ఎవళ్ళయినా తోబుట్టువుల్ని పెళ్ళికి రావద్దని శాసిస్తారా? పిల్లలు చెడ్డవాళ్ళయితే ఏ తల్లయినా చంపేసుకుంటుందా? వీళ్ళకి మతులుండి చేసిన పనులేనా ఇవి?' అని ప్రశ్నిస్తోంది ఆవిడ ఆవిణ్ణి ఊరుకోబెట్టడం అసాధ్యం అయింది. వాగి వాగి ఆమెమట్టుకు ఆమే ఎప్పుడో ఊరుకొంది

ఉదయం భోజనాలయాయి. రాత్రికి విందు ఏర్పాట్లు జరుగుతున్నాయి సత్యన్నారాయణ తాంబూలం వేసుకొని సిగరెట్టు కాల్చుకుంటూ కూర్చున్నాడు పందిట్లో మగపెళ్ళివారు భోజనాలు పూర్తిచేసుకొని విడిదికి వెళ్ళిపోయారు. సత్యన్నారాయణ దగ్గరకొచ్చి కూర్చుంది సీతారామమ్మ.

'పెళ్ళి చేసారు పెళ్ళి? నన్ను కళ్ళారా చూసుకోనిచ్చారు కాదు. వారంరోజుల క్రిందటనే సంబంధం నిశ్చయమయితే వెంటనే నాకు కబురు చెయ్యకూడదూ? రాత్రికి రాత్రి, ఏడువందలమైళ్ళు ప్రయాణంచేసి రావడం ముసల్దానికి నాకు సాధ్యమా? అందులోనూ వస్తే నేను ఒక్కర్తెనే రాలని శాసనం

సరోజను కూడ వెంటబెట్టుకొనివస్తే స్టేషను దగ్గరే నాకు తిరుగుముఖం పట్టించాలని వచ్చారుట. నామీద జాలి తలచి కాదు'

'సరోజ ఎందుకు రాకూడదు?' అని అడిగాడు సత్యన్నారాయణ

కళ్ళనీరు పెట్టుకొని ఆ ప్రశ్నకు జవాబు కొంతసేపటివరకు చెప్పలేకపోయింది సీతారామమ్మ ఇంతలో రామ్మూర్తి నరసింహం వచ్చి ఆమెను అక్కడ్నుంచి తీసుకొని వెళ్ళిపోయారు లోపలకి 'ఇప్పటికి ఈ ఏడ్పులు చాలించు' అంటూ.

రాత్రి విందు భోజనాలయాయి. రామ్మూర్తి తోటి ఉద్యోగస్తులు ఎందరో వచ్చారు ఒక్కరొక్కరే వెళ్ళిపోయారు. మిగిలిన బంధువులూ, ఆడంగులూ భోజనాలు చేస్తున్నారు శివుడొచ్చాడు. వస్తూనే ఆరంభమయింది మళ్ళీ రగడ అన్నగారి మీద మండిపడుతున్నాడు

'నువ్వేలాగ వచ్చేసావు, దాన్ని ఒకత్తెనూ వదలేసి' అని అడిగింది సీతారామమ్మ

'తనే వెళ్ళమంది నాకెలాగూ అదృష్టం లేదు నువ్వయినా చూసిరా నా సంగతి నేను చూసుకోగలనులే రెండు రోజులు' అన్నది దానిమీదేపాటి అభిమానమయినా లేదు ఈ మహానుభావులుకి ఎంతసేపూ తామూ, తమ భార్యలు బాగా ఉంటే సరి. అవతలవాళ్ళు ఎలా తగలబడినా వీళ్ళకు పట్టదు. దానికి ఈ దుర్గతికి వీళ్ళే కారణం. పెళ్ళెందుకు చెయ్యకపోవాలి? ఇదంతా పచ్చి మోసం అమాయకుల్ని మోసం చేస్తే ఆ పాపం వీళ్ళని చుట్టుముట్టి బాధపెడ్తుంది' అని కేకలు వేస్తున్నాడు రామ్మూర్తికి కూడా కోపం ఆగలేదు అన్నదమ్ములిద్దరూ కలియబడారు. శివుడు రుద్రుడయాడు అన్నగార్ని నరికేస్తానని కత్తి ఎత్తాడు.

'నేను చేసిన పని తప్పయినప్పుడు నాకా శిక్ష తప్పక వెయ్యవలసిందే నీ చేతుల్లో చావడంకన్న నాకు సంతోషకరమైన చావు మరి వుండదు' అన్నాడు రామ్మూర్తి

అందరూ అడ్డుపడ్డారు. శివుణ్ణి



పత్రికలో నీ కథ చదివానోయ్ బాలాబావుంది - చివర రచన అని నీ పేరు చూసి ఆశ్చర్యపోయానంటే నమ్ము

రివాల్లు వేసారు.

'ఇక్కడ ఒక్క క్షణం అయినా వుండొద్దు. మనం పోదాం పదవే అమ్మా! వీళ్ల ముఖాలు మళ్లీ ఈ జన్మలో చూడకూడదు. ఇంత చేసిన వాళ్లు ఎంతైనా చెయ్యగలరు' అన్నాడు.

ఏమాటా అనకుండా వాడివెంట నడిచింది సీతారామమ్మ.

సత్యన్నారాయణ ఆమె చేతులు పట్టుకొన్నాడు.

'కొన్ని కాలు తీసుకోండి. అందాక మా యింటికి రండి ఈరాత్రి వుండి ఉదయమే వెళుదురుగాని' అన్నాడు.

సత్యన్నారాయణ యింటికి వచ్చాక శివుడు కొన్ని వల్లబడ్డాడు.

'ఇంతకీ సరోజ ఒక్కర్తీకోసం మీరం దరూ యెందుకు యింత తగువు పట్టు న్నారు ?' అని అడిగాడు.

'అది ఒక్కర్తే అయితే ఏబాధా లేక పోయేది, దానికొక బిడ్డకూడాను ఆర్నెల్ల యింది. దాని పీక నులిపి పారేయమంటే ఏతల్లికి చేతులొస్తాయో చెప్పు నాయనా?' అంది సీతారామమ్మ.

'ఇదంతా ఎలా జరిగింది. అన్నదమ్ములు వదినగార్ల అండన వుండేదేమో ?'

'అదంతా ఆ భగవంతుడికి తెలియాలి నాయనా!'

'ఇంతకీ అతడెవరో తెలిసిందా?!

'తెలియకేమి? అందరకూ తెలుసు.'

'తెలిసే ఊరుకున్నారన్నమాట ?'

'తెలిసి మాత్రం లాభం ఏమిటి? వాడికి పెళ్ళాము, నలుగురు పిల్లలున్నా. అయినా వాడు దాన్ని అన్యాయం చెయ్యను, తన దగ్గరే అట్టే పెట్టుకుంటానన్నాడు కాని ఆ తల్లీ, పెళ్ళాము ఉండనిస్తేనా ? ఇంట్లో కాలు పెడితే దాన్నీ పిల్లనీ కూడ ముక్కముక్కలుగా నరికి పారేస్తానన్నారు. లేదా తమనేనా నరికేయమని కత్తి వాడి చేతికిచ్చారు పిల్లకేమి ప్రమాదం వస్తుందో అని ఊరుకొన్నాం'

'ఇప్పుడు ఎక్కడ వుందయితే ?'

కళ్యాణ శోభ

'పెద్దవాళ్ళిద్దరూ వదిలేస్తే, చిన్న వాడు శివుడు దగ్గర వుంటుంది. ముఖం చూపవద్దన్నారు. చచ్చిపోయావనుకుంటా మన్నారు. ఎక్కడయినా దూరంగా ఎవ రికీ తెలియని చోటు తలదాచుకుంటే తల్లీ పిల్ల పోషణకి ఏమయినా పారేస్తా మన్నారు. ఎక్కడికి పోతుంది ? వాడా యింకా చిన్నవాడు. పెళ్ళిచేసుకొని వృద్ధిలోకి రావలసినవాడు. వాడి నెత్తిని చుట్టుకుంది ఈ పాపం. వాడు అగ్గిమీద గుగ్గిలా అయిపోతున్నాడు వీళ్ళ చేసిన పనికి' అని గోడు పెట్టింది సీతారామమ్మ.

'ఏపాపమూ లేదు ఇతరులెవ్వరూ ఒకరు చేసిన తప్పుకి బాధపడనక్కర్లేదు. దాని దారిని బ్రతికనిస్తే చాలు ఒకర్ని చంప డానికిగాని, చచ్చిపొమ్మని చెప్పడానికిగాని ఎవరికీ అధికారంలేదు చాతనయితే సహాయం చెయ్యాలి! సానుభూతి చూపించాలి. దీని కోసం ఇందర్ని ఇంత బాధకు లోనుచెయ్యడం అవివేకం. తన దారిని తన్ను బ్రతకనిస్తే మీ దారిని మీరు బ్రతకవచ్చు చదువు కున్నది, పైగా నర్సింగ్ ట్రయినింగ్ కూడ ప్యాసయిందిగా దానికొక ఉద్యోగం చూసిపెడితే పోయె. అదృష్టం వుంటే దాని బ్రతుకే బాగుపడవచ్చు. వీరెవ్వరికి ధైర్యం లేకపోతే నా దగ్గరికి పంపు. దాని నిర్ణయం ఏమిటో వ్రాయ మను. నేను కూడ దాని పేర ఉత్తరం రాస్తాను. ఇంతటితో ఈ గొడవ చాలిం చండి. ఈ పెళ్ళేదో సాంతంగా సక్ర మంగా జరిగి సరస్వతి అత్తవారింటికి వెళ్ళిపోయేవరకు చూడండి రామ్మూర్తి తప్పేమీ లేదు ఇందులో. ఒక పెళ్ళిచెయ్యా లనే పట్టుదలే వాణ్ణి ఈపని చేయించింది. ఏడెనిమిదివేలు ఖర్చుపెట్టి కలకాలం సుఖ పడాలని కళ్యాణం తలపెట్టి మీ రిట్లా కొట్లాడుకోవడం భావ్యం కాదు చూసిన వాళ్ళకి ఇది పెళ్ళిపందిరి కాని రణరంగం కాదని నిరూపించండి జరిగినదంతా మరచి పోయి ఈ రెండులోజులూ సఖ్యంగా సర దాగా, సహపంక్తిని భోజనాలు చేయండి. కలతలు మానుకొని కళ్యాణ శోభను కాపా డండి' అన్నాడు సత్యన్నారాయణ.

శివుడు చల్లారేదు సీతారామమ్మ తిరిగి యింటికి వెళ్ళింది. అందరి ప్రాణాలుకి హాయి చేకూరింది.

మరో పదిరోజులనాడు సరోజను చంటి పాపను తీసుకొనివచ్చి శివుడే వచ్చి సత్య న్నారాయణ ఇంట దిగవిడిచివెళ్ళాడు. సరోజ తన చరిత్ర చెప్పుకొని ఏడ్చింది

'ఏడ్చేవాళ్ళకి జీవితం కాదు జీవించా లంటే ధైర్యం కావాలి. అన్నాడు సత్య న్నారాయణ

సత్యన్నారాయణ ప్రయత్నం శీఘ్రంగానే ఫలించింది. సరోజకు పట్నంలో జనరల్ హాస్పిటల్ నర్సుగా ఉద్యోగం దొరికింది ! వుండడానికి 'క్వార్టర్సు' ఇచ్చారు పాపని కనిపెట్టడానికి ఒక దాదిని పెట్టుకుంది. ఈ కొత్త జీవితానికి క్రమంగా అలవాటు పడింది. రామ్మూర్తికి మాత్రం సరోజ అక్కడ వుండడం కష్టంగా తోచింది. అటువంటి పతితను ఆదరించిన సత్య న్నారాయణను ఆయన క్షమించదలచుకో లేదు 'వాణ్ణి మళ్ళీ నా గుమ్మంలో అడుగు పెట్టనివ్వను' అన్నాడు కాని సత్యన్నారా యణ మాత్రం చలించలేదు వీలయినప్పు డల్లా రామ్మూర్తి యోగక్షేమాలు అడిగి పోతూ వుండేవాడు.

ఆఫీసునుంచి తిరిగివస్తూ సత్యన్నారా యణ ఒక సాయంత్రం రామ్మూర్తి ఇంటికి



వెళ్ళేసరికి రామ్మూర్తిగారి భార్యగాని ఇంటిదగ్గర లేరు పిల్లలు మాత్రమే కనిపించారు అడిగాడు 'హాస్పిటల్‌కి వెళ్ళారు' అని చెప్పింది పెద్దపిల్ల

'ఏమయిందే మీ నాన్నకి?' అని అడిగాడు

'నాన్నకి కాదు, అన్నకి. నిన్న సాయంత్రం మామిడిచెట్టుమీన్నుంచి క్రిందపడ్డాడు తెలివి తప్పిపోయింది స్నేహితులు హాస్పిటల్‌కి చేర్చారు నాన్నతో చెప్పారు నాన్నా అమ్మా రాత్రే వెళ్ళారు. అమ్మ అక్కడే వుంది'

'ఎలాగుందే వాడికి ఇప్పుడు?'

'నిన్న రాత్రే ఆపరేషన్ అయిందట ఇవాళ వార్డులోకి తెచ్చారట. తెలివి వచ్చిందట'

'బెడ్ నెం?'

'42.'

అటునుండి అటుగానే సత్యన్నారాయణ హాస్పిటల్‌కి వెళ్ళాడు. 'సర్జికల్‌వార్డు'లో బెడ్ నెం 42 దగ్గర రామ్మూర్తి, భార్యా కూర్చొని వున్నారు రామ్మూర్తి ముఖాన్ని విషాదం తాండవిస్తోంది. సత్యన్నారాయణను చూడగానే కాస్త తేరుకున్నాడు

'చూశావా ఈ పిల్లల సంగతులు వీళ్ళు తిన్నగా బ్రతకరు. నన్ను బ్రతకనివ్వరు. నిన్న రాత్రంతా నేను పడిన బాధ ఆ భగవంతుడికి తెలియాలి మొక్కని దేవుళ్ళు అంటూ లేరుకదా ఆ తిరుపతి వెంకటేశ్వరుడి మీద భారం అంతా పడేసి కూచున్నాను అంటే నమ్మ ఏదో కాసింత ఆయుర్దాయం వాడికి, అదృష్టం మనకీ ఉండబట్టే ఈమాత్రం నిలిచాము. లేకపోతే వాడిముఖం చూస్తానని అనుకోలేదు అంత ఎత్తునుంచి పడ్డాడేమో, నడుమూ తుంటి ఎముక విరిగాయి. కడుపులో కిడ్నీలు 'హెమరేజ్' అయాయి వెంట వెంటనే ఆపరేషన్ చెయ్యబట్టే ప్రాణం దక్కింది. మరికొంచెం ఆలశ్యమయితే అది కూడ సాధ్యం అయ్యేదికాదు సరోజ ఉండబట్టే ఆ సర్జనును లాక్కొచ్చింది. ఇది మేజర్ ఆపరేషన్ తావే ఆపరేషన్ థియేటరులోవుండి సర్జన్‌కి అసిస్టుచేసింది దాని పట్టుదల వలననే మావాడి ప్రాణాలు దక్కాయి అది మాకు పుత్రభిక్ష పెట్టింది దాని ఋణం ఈ జన్మంలో తీర్చుకోలేను'అని ఒక వరసన చెప్పుకొని పోతున్నాడు రామ్మూర్తి రామ్మూర్తేనా ఈ మాటలు అంటున్నది! ఒకప్పుడు సరోజను చచ్చిపొమ్మని శాసించిన రామ్మూర్తి ఎంత మారిపోయాడు!

రెండునెలలు నాటికి రాముడులేచి తిరుగుతున్నాడు. రామ్మూర్తి ఆనందానికి హద్దులేక పోయింది. 'తిరుపతి 'వెంకటేశ్వ'రుడి మొక్కు తీర్చుకుందేందికి మళ్ళీవారం బయలుదేరుతున్నాం?–' అని చెప్పాడు రామ్మూర్తి ఇంటికి వచ్చిన సత్యన్నారాయణతో.

'మంచిదే దానికిముందు మరొక శుభకార్యం చెయ్యగలవా?' అని అడిగాడు సత్యన్నారాయణ

'ఏమిటది?'

'సరోజని పెళ్ళి చేసుకోడానికి ఒక అబ్బాయి అంగీకరించాడు సరోజకూడ ఇష్టపడింది. రేపువాళ్ళు 'సివిల్ మేరేజ్' చేసుకుంటారు, రిజిస్ట్రారు ఆఫీసులో నువ్వు ఒకసాక్షిగా సంతకంచేసి వాళ్ళని ఆశీర్వదించడానికి రావాలి' అన్నాడు సత్యన్నారాయణ.

'అంతేకాదు వాళ్ళకి మాయింట్లో విందుకూడ ఏర్పాటుచేస్తాను. అమ్మకూడ ఇక్కడేవుంది అదికూడ వాళ్ళని ఆశీర్వదిస్తుంది' అన్నాడు రామ్మూర్తి.

'కొత్త పెళ్ళికూతురు వేషంలో సరోజను చూసిన సీతారామమ్మ 'కళ్యాణ శోభను కళ్ళారా చూసాను, నాజన్మ తరించింది' అని కళ్ళ నీళ్ళ తుడుచుకుంది ●

ఆల్బో-సాంగ్

అన్ని వయసుల
వారికి ఆదర్శక బలవర్ధకం

మీరు అన్నివిధాల ఆరోగ్యంగా వుండాలంటే మీకు ఆల్బో-సాంగ్ అవసరం వృద్ధులకు యువకులకు కూడా పటిష్టమైన శరీరాన్ని ఆరోగ్యాన్ని సంపాదించుటకు ప్రత్యేకమైన పదార్థాలు ఆల్బో-సాంగ్‌లో చేర్చబడ్డాయి ఈ రోజు ప్రతి రోజూకూడా ఆల్బో-సాంగ్ తీసుకోండి. సర్వదా మీరు ఆరోగ్యంగా వుంటారు

జె. అండ్ జె. డీషేన్
హైదరాబాదు (దక్కన్).